సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం ; 25 ; జూలై ; 2024



ఈ-క్రాప్ నమోదు ఎప్పుడో?

వరదకు వేలాది ఎకరాల్లో వరి నాట్లు నీట మునిగాయి. ఇలాంటి తరుణంలో ఈ-క్రాప్ నమోదు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 8లో ▸



డ్వాక్రా సీపల తొలగింపు

ప్రభుత్వం మారిన నేపథ్యంలో కొందరు వెలుగు సీప (వీఓఏ)లను తొలగించి, టీడీపీకి అనుకూలమైన వారిని ఆ స్థానంలో నియమించాలని హుకుం జారీ చేస్తున్నారు. 8లో ▸



ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమంటూ దందా

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమంటూ కర్రీ పాయింట్‌ను సీజ్ చేస్తామంటూ బెదిరించి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసిన నలుగురు నకిలీ విలేకరులను పోలీసులు అరెస్టు చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



యండగండి లాకుల వద్ద నీటి ఉధృతి పరిశీలిస్తున్న రైతు కార్యాచరణ సమితి నేతలు

భీమవరం: అధిక వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పాతపాటి మురళీ రామరాజు డిమాండ్ చేశారు. రైతు కార్యాచరణ సమితి సభ్యుల బృందం బుధవారం భీమవరం, ఉండి నియోజకవర్గాల పరిధిలోని యనమదుర్రు డ్రైన్, ఉండి పంట కాలువ పరిధిలో వరద వల్ల ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మురళీ రామరాజు మాట్లాడుతూ పంట కాలువలు, డ్రైనేజీలలో గుర్రపు డెక్క, తూడు, కిక్కిస పెరిగిపోవడంతో చాలా ప్రాంతాలలో సార్వా సాగు చేయడం లేదని నాట్లు వేసిన భూములు నీట మునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రైతు కార్యాచరణ సమితి నాయకులు భూపతిరాజు సత్యనారాయణరాజు, ముదుండి సత్యనారాయణరాజు, గోపిశెట్టి మురళీకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు నగరపాలక సంస్థతో పాటు 7 పురపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్, దాని సమాన హోదా కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించే నిమిత్తం సీనియారిటీ జాబితా బీఎస్‌ఈ ఏపీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్(తెలుగు, హిందీ)లో పదోన్నతులు కల్పించడానికి ఈ సీనియారిటీ జాబితా సిద్ధం చేసినట్లు తెలిపారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 31 లోపు ఏలూరులోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి సమర్పించాలని సూచించారు.

టీచ్ టూల్ ట్రైనింగ్ సెంటర్ తనిఖీ

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతుందని దీనిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక బీఆర్ఎంవీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ ట్రైనింగ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. శిక్షణలో పాల్గొన్న ప్రతి అబ్జర్వర్ తమ పాఠశాలల్లో బోధనా పద్ధతుల క్వాలిటీ పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలు పొందాలన్నారు. ట్రైనింగ్ సెంటర్‌లో ప్రతిభ చూపిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాలకొల్లు, యలమంచిలి ఎంఈవోలు గుమ్మళ్ల వీరాస్వామి, కృష్ణంరాజు, కెవిఎస్ మూర్తి, నగేష్, వి.లక్ష్మీనారాయణ, నరసింహరాజు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి

గణపవరం: కౌలు రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం బకాయిలు తక్షణం చెల్లించాలని, లేదంటే రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పెచ్చెట్టి నర్సింహమూర్తి అన్నారు. బుధవారం గణపవరం మండలం కేశవరంలో కౌలు రైతులతో కలిసి ఆయన ధాన్యం బకాయిలు చెల్లించాలంటూ ఆందోళన నిర్వహించారు. మూడు నెలలుగా ధాన్యం డబ్బులు ఇవ్వకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, మరోవైపు వరదల కారణంగా నాట్లు నీటమునిగి రైతులు నష్టపోయారని అన్నారు. కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని, ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అమరావతికి నిధులపై స్పష్టతనివ్వాలి

నూజివీడు: బడ్జెట్‌లో అమరావతి అభివృద్ధికి ఇచ్చింది రుణమా? గ్రాంటా? అనేది కేంద్ర ఆర్థిక మంత్రి స్పష్టం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ డిమాండ్ చేశారు. నూజివీడులో బుధవారం ఆయన మాట్లాడుతూ రూ.15 వేల కోట్ల గురించి గొప్పలు చెప్పుకోవడం మానేసి రుణమా, గ్రాంటా అనేది తేల్చి రాష్ట్ర ప్రజలకు స్పష్టతనివ్వాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలన్న డిమాండ్‌ను పూర్తిగా విస్మరించారని ధ్వజమెత్తారు. వ్యవసాయానికి కేవలం 2.5శాతం కేటాయించారని అసంతృప్తి వ్యక్తం చేశారు.

అన్నదాత.. గుండెకోత

- ఐదు రోజులుగా నీటిలోనే నాట్లు
- జిల్లాలోని 2.3 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు
- ఇప్పటికే ఎకరానికి రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు పెట్టుబడులు
- వర్షాలు, వరదలతో 38 వేల ఎకరాల్లో నీటమునిగిన పొలాలు
- రూ.41.51 కోట్ల నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా
- రూ.4.1 కోట్ల విలువైన ఉద్యాన పంటలకు నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు



తాడేపల్లిగూడెం మండలంలో ముంపులో పంట పొలాలు

సాక్షి, భీమవరం: కోటి ఆశలతో తొలకరి ప్రారంభించిన రైతులకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, వశిష్ట గోదావరి వరదతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఐదు రోజులుగా జిల్లాలోని 38 వేల ఎకరాల తొలకరి పంట పొలాలు ముంపులోనే ఉన్నాయి. రూ.41.51 కోట్ల పంట నష్టం వాటిల్లినట్టు అధికారుల ప్రాథమిక అంచనా. జిల్లాలోని 2.30 లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగుచేపట్టగా 90 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. అధికంగా తాడేపల్లిగూడెం మండలంలోని 25 వేల ఎకరాల్లో నాట్లు పూర్తి కాగా పెంటపాడు మండలంలో 23 వేల ఎకరాలకు 70 శాతం, తణుకు రూరల్‌లో 12 వేల ఎకరాలకు 80 శాతం, అత్తిలి మండలంలో 14,500 ఎకరాలకు 50 శాతం, ఇరగవరం మండలంలో 13,500 ఎకరాలకు 80 శాతం, పెనుమంట్ర మండలంలో 12 వేల ఎకరాలకు 70 శాతం మేర నాట్లు పూర్తయ్యాయి. ఆచంట, పోడూరు, పాలకొల్లు రూరల్, యలమంచిలి, ఆకివీడు, ఉండి, కాళ్ల తదితర మండలాల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముందుగా నాట్లు పూర్తయిన చోట పంట మూనలు తిరిగే దశలో ఉంది.

నిండాముంచిన వర్షాలు, వరదలు : బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఈనెల 18 నుంచి నాలుగు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. దీనికితోడు ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరికి వరద పోటెత్తింది. వీటి ప్రభావంతో జిల్లాలోని ఎర్రకాలువ, వయ్యేరు, యనమదుర్రు డ్రెయిన్, గోస్తనీ నది, గొంతేరు, రాచకోడు, ఈర్లకోడు, ఆరుదలకోడు తదితర డ్రెయిన్లు పొంగిప్రవహిస్తూ పరివాహక ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి.

ఆలస్యం కానున్న సాగు : ఐదురోజులుగా నాట్లు వేసిన పొలాలు, నారుమడులు నీటిలో నానుతుండటంతో రైతులకు కంటిమీద కునుకు కరువైంది. చాలా చోట్ల నారు పూర్తిగా కుళ్లిపోయి పనికిరాకుండా పోతోంది. పూర్తిగా నీటమునిగిన పొలాల్లో తిరిగి నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి. వేల ఎకరాలు నీట మునగడంతో నారుకు తీవ్ర కొరత ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితులతో ఖరీఫ్ సాగు ఆలస్యమవుతుందని వారంటున్నారు. విత్తనాల నుంచి నాట్ల వరకు ఎకరాకు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు పెట్టుబడులు పెట్టామని ఆ రకు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన క్తం చేస్తున్నారు. రైతులను ఆదుకునే దిశగా ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అందని భరోసా

ఖరీఫ్ ప్రారంభానికి ముందే గత ప్రభుత్వం వైఎస్సార్ రైతుభరోసా పథకం కింద రూ.7,500 సాయాన్ని రైతుల ఖాతాలకు జమచేసేది. పంట పెట్టుబడుల కోసం సన్న చిన్నకారు రైతులకు ఈ సాయం ఎంతో ఉపయోగపడేది. ఈ ఏడాది కేంద్రం రూ.2 వేలు జూన్‌లో రైతుల ఖాతాలకు జమచేయగా కూటమి ప్రభుత్వం నుంచి ఇంకా సాయం అందలేదు. అయినప్పటికీ అయినకాడికి అప్పులు చేస్తూ రైతులు పనులు ముమ్మరం చేస్తున్నారు.

38 వేల ఎకరాల్లో పంట నష్టం

జిల్లాలోని 20 మండలాల పరిధిలోని 38 వేల ఎకరాల్లో పంట నీట మునిగినట్టు వ్యవసాయాధికారులు గుర్తించారు. రూ.41.51 కోట్ల మేర పంట నష్టం వాటిల్లినట్టు అంచనా. 614 మంది రైతులు సాగు చేస్తున్న 500 ఎకరాల్లోని ఉద్యానవన పంటలకు రూ.4.06 కోట్లు నష్టం వాటిల్లినట్టు అంచనా వేస్తున్నారు. పొలాల్లోని ముంపునీరు లాగి క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రారంభమైతే పంట నష్టం మరింత పెరుగుతుందని రైతులు అంటున్నారు.



తేతలిలో నీట మునిగి కుళ్లిన నారును చూపిస్తున్న రైతులు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



భీమవరం కేజీఆర్ఎల్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

భీమవరం: వ్యక్తిగత సమాచారాన్ని గుర్తు తెలియని వ్యక్తులతో పంచుకోవడం వల్ల వేధింపులకు గురయ్యే ప్రమాదముందని భీమవరం డీఎస్పీ వి.నారాయణ స్వామిరెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కోసం కేజీఆర్ఎల్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఓటిపి నెంబర్లు, బ్యాంక్ అకౌంట్ వివరాలను అపరిచితులకు ఇవ్వవద్దని, సెల్‌ఫోన్‌లో వచ్చే అనవసరమైన లింక్స్ ఓపెన్ చేయడంతో అనేక ఇబ్బందులు వస్తున్నాయన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆన్‌లైన్ వేధింపులకు గురి చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీఐ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ మోసపూరిత రుణయాప్‌ల నుంచి సురక్షితంగా ఉండాలన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి, కళాశాల ప్రిన్సిపల్ మెంటే హరినాథ్‌బాబు, ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఐ శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి

భీమవరం: నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో యువతకు ఉద్యోగ కల్పనపై స్కిల్ డెవలప్‌మెంట్ అధికారితో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు మెరుగైన ఉద్యోగాలు కల్పించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని దీనికి అందుబాటులో ఉన్న ప్రముఖ పరిశ్రమలు, కంపెనీల యాజమాన్యాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలు సేకరించాలన్నారు.

న్యూఢిల్లీ ధర్నాలో పాలకొల్లు నేతలు



న్యూఢిల్లీలో నిర్వహించిన ధర్నాలో వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి, యడ్ల తాతాజీ



ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు

పాలకొల్లు అర్బన్: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అరాచకాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు తక్షణం రాష్ట్రపతి పాలన విధించాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి న్యూఢిల్లీలోని బుధవారం చేపట్టిన ధర్నా కార్యక్రమంలో పాలకొల్లు నేతలు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ టీడీపీ అరాచకాలకు దేశప్రజలకు తెలియజేయడం కోసం చేపట్టిన ఆందోళనకు సంఘీభావం లభించిందన్నారు.

తూర్పుమెట్టకు కదిలిన యంత్రాంగం

సాక్షి స్పందన

వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలోని తూర్పుమెట్ట గ్రామానికి బుధవారం జంగారెడ్డిగూడెం ఆర్డీఓ అద్దయ్య ఆధ్వర్యంలో అధికారుల బృందం పర్యటించింది. బుధవారం 'సాక్షి' దినపత్రికలో 'నడి గోదావరిలో.. బిక్కుబిక్కుమంటూ' శీర్షికతో వార్త వెలువడిన విషయం తెలిసిందే. ఈ వార్తకు స్పందించిన అధికారులు మంచినీటి ప్యాకెట్‌లు, కూరగాయలు, కొవ్వొత్తులు, బిస్కెట్‌లు, మస్కిటో కాయిల్స్ పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా టార్పాలిన్ కవర్‌లు అందజేశారు. వైద్యాధికారి రాజీవ్ నేతృత్వంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.



తూర్పుమెట్టలో కూరగాయలు, కొవ్వొత్తులు పంపిణీ చేస్తున్న ఆర్డీఓ అద్దయ్య తదితరులు

నిలకడగా గోదావరి





యలమంచిలి మండలం కనకాయలంకలో పడవలపై ప్రయాణిస్తున్న గ్రామస్తులు, (ఇన్‌సెట్‌లో) నరసాపురంలో వశిష్ట గోదావరి వలంధర్ రేవు వద్ద ప్రవహిస్తోన్న వరద


యలమంచిలి: గోదావరిలో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. కనకాయలంక కాజ్‌వేపై మూడో రోజూ నాలుగు అడుగుల వరద నీరు ప్రవహించింది. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద వరద తగ్గుముఖం పట్టడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదేవిధంగా నీరు తగ్గితే గురువారం మధ్యాహ్నానికి కాజ్‌వే మీద నీరు తగ్గవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. వరద ప్రభావిత కనకాయలంక, పెదలంక గ్రామాలలో బుధవారం తహసీల్దార్ చిక్కాల విజయశ్రీ పర్యటించారు. ఇంజిన్ బోటుపై కాజ్‌వే దాటి కనకాయలంకకు వెళ్లారు. అక్కడ వైద్య శిబిరాన్ని సందర్శించారు. కొంతసేపు గ్రామస్తులతో మాట్లాడారు. వరద వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

నిలిచిన పంటు రాకపోకలు

నరసాపురం: నరసాపురం వద్ద వశిష్ట గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. వలంధర్‌రేవులో పిండ ప్రదానాలు చేసే షెడ్డుపైకి వరకూ వరదనీరు ప్రవహిస్తోంది. వలందర్‌రేవులో ఎవరూ స్నానాలకు దిగకుండా నిషేధం విధించారు. సముద్రం పోటు సమయంలో నీటిమట్టం పెరుగుతోంది. గోదావరి ఉధృతి కారణంగా పట్టణంలోని మాధవాయిపాలెం రేవులో పంటు రాకపోకలను గత నాలుగు రోజులుగా అధికారులు నిలిపేశారు. దీంతో ప్రయాణికులు చించినాడ వంతెన మీదుగా చుట్టుతిరిగి ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. మరో రెండు, మూడు రోజుల వరకూ పంటు రాకపోకలు కొనసాగే అవకాశం కనిపించడంలేదు. పట్టణ పరిధిలో 5 చోట్ల అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల నుంచి గోదావరి వరదనీరు పైకి ఎగదన్నుతోంది. దీంతో గోదావరి బండ్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతాలు వరద తాకిడికి గురవుతున్నాయి.

ఇంకా ముంపులోనే గ్రామాలు

తణుకు: తణుకు మండలంలో వెంకయ్య వయ్యేరు నీటి మట్టం బుధవారం సాయంత్రానికి కాస్త తగ్గింది. అయితే వరిచేలు మాత్రం నీటి ముంపులోనే కొనసాగుతున్నాయి. గురువారం నాటికి వరద ఉధృతి తగ్గుతుందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఎర్రకాలువ ఉధృతి కొంతమేర తగ్గుముఖం పట్టినప్పటికీ వయ్యేరులో వరద ఉధృతి కొనసాగుతోంది. మండలంలోని కోనాల, ముద్దాపురం, దువ్వ గ్రామాల ప్రజలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నారు. పలు కాలనీలను వరదనీరు చుట్టుముట్టింది. పంట కాలువల్లో పూడికలు తీయకపోవడంతో నీరు ముందుకు లాగలేదు. తణుకు నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో సుమారు 45 వేల ఎకరాల్లో వరినాట్లు వేశారు. ఎకరాకు రూ. 8 వేలు నుంచి రూ. 13 వేలు వరకు పెట్టుబడి పెట్టారు. నియోజకవర్గంలో సుమారు 20 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు.



కోనాల గ్రామంలో ముంపులోనే వరిచేలు

వరద నష్టం రూ.187 కోట్లు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లాలో భారీ వర్షాలు, వరదలకు రూ.187 కోట్ల మేర నష్టం జరిగింది. గోదావరి వరదల నేపథ్యంలో 10 గ్రామాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరద ప్రభావంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 321 ఇళ్లు దెబ్బతినగా, గొర్రెలు, పాడి పశువులు మృతి చెందాయి. జిల్లాలో 190 హెక్టార్లలో నారుమళ్లు దెబ్బతిన్నాయి. 2,554 హెక్టార్లలో పంట నష్టానికి గురైంది. 155 గ్రామాల పరిధిలో 3,288 మంది రైతులు నష్టపోయారు. 500 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో 333 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా రూ.167 కోట్ల మేర రోడ్లు, భవనాల శాఖకు నష్టం వాటిల్లగా, 13 రోడ్లు పంచాయితీరాజ్ శాఖకు సంబంధించిన రోడ్లకు పూర్తి స్థాయిలో నష్టం వాటిల్లింది. మైనర్ ఇరిగేషన్ పరిధిలో 17 చెరువులకు నష్టం వాటిల్లింది. దీంతో రూ.3 కోట్ల నష్టం వాటిల్లింది. డిప్పకాయలపాడులోని రాజుచెరువు, కేతవరంలోని దున్నపోతుచెరువు దెబ్బతినడంతో నష్టం అంచనా వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

కనిపించదా ముంపు ఘోష

- ప్రభుత్వానికి పట్టని ఎర్రకాలువ ముంపు రైతుల ఆవేదన
- ఆదుకోకపోతే చావే శరణ్యమంటూ చంద్రబాబు, పవన్‌కు ఓ రైతు అల్టిమేటం

తాడేపల్లిగూడెం: వాగులు.. కాలువల్లో వరద పోటెత్తుతోంది. ఊళ్లపైకి ఉరకలెత్తి పంటల్ని ముంచెత్తుతోంది. రైతులు, ప్రజల కష్టాలు పట్టించుకునే తీరిక లేనంతగా.. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాల్లో మునిగిపోయింది. ముంపుబారిన పడిన తమను ఆదుకోవాలని రైతులు పొలికేక పెడుతున్నా.. సర్కారు చెవిన పడటం లేదు. ముంపు ఘోష సైతం పాలకులకు కనిపించటం లేదు. ఎర్రకాలువ ముంపు ప్రాంతాల్లో పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన విలేకరుల బృందానికి అక్కడి రైతులు తమ దీనస్థితిని చెప్పుకుని కన్నీటి పర్యంతమయ్యారు. తమ కష్టాలను పట్టించుకోని ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఇప్పటికైనా తమను పట్టించుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. తాడేపల్లిగూడెం మండలం నందమూరు గ్రామానికి చెందిన కొప్పిశెట్టి వెంకన్న (68) అనే రైతు తన గోడు ఆయన మాటల్లోనే..

బాబు.. పవన్ పట్టించుకోకపోతే చావే గతి

'అయ్యా.. వేలకు వేలు పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేస్తున్నా. ఎర్రకాలువ వరద పంటను మింగేసింది. ఈ మధ్యే గుండె సంబంధ వ్యాధితో రాజమండ్రిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది వచ్చాను. పెట్టుబడి కోసం నా భార్య మెడలోని మంగళ సూత్రాల్ని సైతం తీసుకెళ్లి బ్యాంకులో తాకట్టు పెట్టాను. పెట్టుబడి అంతా నీళ్ల పాలైంది. ప్రభుత్వం ఆదుకోకపోతే నాకు చావే శరణ్యం. 15 ఎకరాలు కౌలుకు తీసుకుని ఎంతో నరకం అనుభవిస్తున్నాను. నాకు 68 ఏళ్లు. నా కొడుక్కి ఉబ్బసం. నాకు తిండి కూడా పెట్టలేనంటున్నాడు. మాకు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ దిక్కు అనుకున్నాం. వాళ్లు ఆదుకోకపోతే నేను చచ్చిపోతా' అంటూ రైతు కొప్పిశెట్టి వెంకన్న కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ పరిస్థితి ఒక్క వెంకన్నకే పరిమితం కాలేదు. ఎర్రకాలువ పరీవాహక ప్రాంతమైన తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల, నిడదవోలు, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, తణుకు మండలాల్లోని వివిధ గ్రామాల రైతులంతా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తమ అవస్థలను పట్టించుకోవాలని.. ఆదుకోకపోతే ఆత్మహత్యలు తప్ప మరో గత్యంతరం లేదని ఆయా గ్రామాల రైతులు ముక్తకంఠంతో చెబుతున్నారు.



గోడు వెళ్లబోసుకుంటున్న రైతు కొప్పిశెట్టి

క్లుప్తంగా

బోనుకు చిక్కిన పునుగు పిల్లి



ఆకివీడు గంగానమ్మకోడు ప్రాంతంలో బోనులో ఉన్న పునుగు పిల్లి

ఆకివీడు: ఆకివీడులోని గంగానమ్మ కోడు వీధిలో బుధవారం ఒక బోనుకు పునుగు పిల్లి చిక్కింది. ఎలుకల కోసం ఈరి రమేష్ అనే వ్యక్తి ఏర్పాటు చేసిన బోనెలో పునుగుపిల్లి చిక్కి ఉండటాన్ని గుర్తించడంతో స్థానికులు అధిక సంఖ్యలో వచ్చి తిలకించారు. దీనిపై అధికారులకు సమాచారం అందించినట్లు రమేష్ తెలిపారు.

సీఎం సహాయనిధికి 'శశి' విరాళం



సీఎం చంద్రబాబుకు రూ.కోటి చెక్కు అందిస్తున్న బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని శశి విద్యాసంస్థల తరపున ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.కోటి విరాళం అందజేశారు. శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విరాళం చెక్కు అందజేశారు. ఆయన వెంట రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, శశి విద్యాసంస్థల డైరెక్టర్ బూరుగుపల్లి రాధారాణి, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ ఉన్నారు.

యువతిని మోసగించిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు

భీమవరం: పట్టణానికి చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన ఓ వ్యక్తికి కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష విధించినట్లు బుధవారం వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. 2019లో జూన్ 7న బాధిత యువతి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ పి.చంద్రశేఖర్, ఏకే భగవాన్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బుధవారం ఏలూరులో నాలుగో అదనపు కోర్టులో ఈ కేసు విచారణకు రాగా మోసం చేసిన వ్యక్తి ఎం.ప్రవీణ్‌కుమార్ (నాని) నేరం నిరూపణ కావడంతో అతనికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు తెలిపారు.

గల్లంతైన ట్రాక్టర్ డ్రైవర్ మృతదేహం లభ్యం

యలమంచిలి: యలమంచిలిలంక గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పితాని ఆనందరావు (43) సోమవారం గోదావరిలో స్నానానికి దిగి గల్లంతైన విషయం తెలిసిందే. అతని కోసం మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలించినా అతని ఆచూకీ తెలియలేదు. ఎట్టకేలకు బుధవారం ఉదయం ఆనందరావు మృతదేహం లభ్యమైంది. ఆనందరావు స్నానానికి దిగిన ప్రదేశానికి కూతవేటు దూరంలోనే మృతదేహం పైకి తేలడంతో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృంద సభ్యులు బయటకు తీశారు. అనంతరం మృతదేహానికి శవ పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోదరుడు పితాని పుష్పరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కాకి శివనారాయణ చెప్పారు.

ఈ-క్రాప్ నమోదు ఎప్పుడో?

- జూలై ముగుస్తున్నా ఇప్పటికీ చేపట్టని కొత్త ప్రభుత్వం
- ప్రభుత్వ మార్గదర్శకాలు కోసం యంత్రాంగం నిరీక్షణ
- వరదలకు దెబ్బతిన్న పంటలపై అన్నదాతల్లో ఆందోళన
- గత ప్రభుత్వంలో ఈ-క్రాప్ నమోదుతో రైతులకు మేలు
- జిల్లాలో 2.19 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు
- ఇప్పటికే 93 వేల ఎకరాల్లో పూర్తయిన వరి నాట్లు



భీమవరం శివారులో వరి పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేస్తున్న దృశ్యం (ఫైల్)

భీమవరం: జిల్లాలో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్న తరుణంలో భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో వరి నారుమళ్లు, నాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇంకా వేలాది ఎకరాల్లో వరి నాట్లు వరద నీట మునిగే ఉన్నాయి. ఇటువంటి తరుణంలో ఈ-క్రాప్ నమోదు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఏటా పంటల సాగు సమయంలో వ్యవసాయశాఖ సిబ్బంది పంట పొలాల వద్దకు వెళ్లి ఈ-క్రాప్ నమోదు చేసేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో ఈ-క్రాప్ నమోదు చేసే దిశగా చర్యలు కానరాకపోవడంతో రైతులు కలవరపడుతున్నారు. ప్రస్తుత అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఈ-క్రాప్ నమోదుపై ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ-క్రాప్ నమోదు కాకుంటే ప్రభుత్వ రాయితీలు, విపత్తుల సమయంలో పరిహారం, పంట అమ్మకాల సమయంలో ఇబ్బందులు తప్పవని అంటున్నారు. గత ప్రభుత్వం రైతులకు కొండంత అండగా ఉండి రైతు భరోసా కేంద్రాల ద్వారా తక్కువ ధరకు ఎరువులు, పురుగుమందులు విక్రయించేంది. అలాగే ఈ-క్రాప్ నమోదు ద్వారా పంట సాగుకు ఎరువుల కొనుగోలు, పంట అమ్మకం, పంట నష్టం జరిగినప్పుడు పంటల బీమాకు ఈ-క్రాప్ ఉపయోగపడుతుంది. ఎంతో ప్రాధాన్యత ఉన్న పంటల నమోదు కార్యక్రమంపై ప్రభుత్వం ఆలస్యం చేయడాన్ని రైతులు తప్పుపడుతున్నారు.

ప్రయోజనాలు ఇలా..

రైతులు వేసిన పంటను ఈ-క్రాప్ చేయించడం వల్ల పంటల బీమా వర్తిస్తుంది. పంట రుణాలు మంజూరవుతాయి. ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం అందుతుంది. పండించిన పంటను మద్దతు ధరకు విక్రయించుకోవచ్చు. జగన్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం 2019 నుంచి 2023 వరకు ఈ-క్రాప్ ఆధారంగానే రైతులకు పథకాలను వర్తింపజేసింది. ఏటా సార్వా సాగు ప్రారంభమైన వెంటనే ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ప్రారంభించేది. గ్రామ వ్యవసాయ సహాయకులు పంట సాగు చేసిన రైతులను పొలం వద్ద నిలబెట్టి పంటతో పాటు ఫొటో తీసి యాప్‌లో వివరాలు నమోదు చేసేవారు.

38 వేల ఎకరాల్లో నాట్లు మునక

జిల్లాలోని 20 మండలాల పరిధిలో దాదాపు 2.19 లక్షల ఎకరాల్లో సార్వా వరి నాట్లు వేయాల్సి ఉండగా, ఇప్పటివరకు సుమారు 93 వేల ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా 38 వేల ఎకరాలకు పైగా వరినాట్లు, నారుమడులు దెబ్బతిన్నాయి. ఇటువంటి తరుణంలో ప్రభుత్వం నుంచి వచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ, సబ్సిడీ విత్తనాలు వంటివాటికి ఈ-క్రాప్ నమోదు లేకపోవడంతో తీవ్ర అడ్డంకిగా మారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా ఇప్పటికే నాట్లు ఆలస్యం కాగా నారుమళ్లు దెబ్బతినడం వల్ల తిరిగి నారుమడి వేసి, నాట్లు వేయాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు సరఫరా చేస్తే రైతులకు కొంతమేరకు ఉపశమనం కలుగుతుందని, అయితే ఈ-క్రాప్ లేకపోవడం వల్ల ఎవరి నారుమళ్లు, నాట్లు దెబ్బతిన్నది వ్యవసాయశాఖ ప్రత్యేకంగా పరిశీలన చేయాల్సి ఉంటుందని, అదే ఈ-క్రాప్ నమోదై ఉంటే వెంటనే బాధితులను గుర్తించి ప్రభుత్వ ప్రయోజనం అందించే అవకాశం ఉండేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణం స్పందించి ఈ-క్రాప్ నమోదుకు మార్గదర్శకాలు జారీ చేసిన వెంటనే ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయించాలని రైతులు కోరుతున్నారు.

మార్గదర్శకాలు రాలేదు



ప్రస్తుత సీజన్‌లో ఈ-క్రాప్ నమోదుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. గతంలో గ్రామస్థాయిలో నిర్వహించిన రీసర్వేలో కొన్ని ఇబ్బందులు ఉన్నందున వాటిని పరిష్కరించిన అనంతరం ఈ-క్రాప్ నమోదు చేసే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడగానే ఈ-క్రాప్ నమోదు చేపడతాం.

– జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

ఆధారాలు లేని 300 సెల్‌ఫోన్లు స్వాధీనం



ఏలూరులో ఓ షాపులో ఆధారాలు లేని ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసు అధికారులు

ఏలూరు టౌన్: ఏలూరులోని సెల్‌ఫోన్ షాపులపై పోలీసులు బుధవారం ఆకస్మిక దాడులు చేశారు. ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాలతో సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ, టూటౌన్ పోలీసులు సెల్‌ఫోన్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఇటీవల కాలంలో సెల్‌ఫోన్ చోరీలు భారీగా జరుగుతుండడం, చోరీ చేసిన ఫోన్లను దుకాణదారులు కొనుగోలు చేసి ఇతరులకు విక్రయిస్తున్నారు. ఇలా కొన్న ఫోన్లు చోరీకి గురైనవి అని తీరా తెలియడంతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాలతో తనిఖీల అనంతరం ఏలూరు సీసీఎస్ సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ నగరంలోని సెల్‌ఫోన్ షాపుల్లో తనిఖీలు చేశామని, వాటిలో సరైన ఆధారాలు, పత్రాలు లేని సుమారు 300 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ ఫోన్లకు సంబంధించి ఎవరైనా వినియోగదారులు సరైన పత్రాలు చూపిస్తే వాటిని అప్పగిస్తామని స్పష్టం చేశారు. సెల్‌ఫోన్లు రిపేర్లు, విక్రయాలు చేసే దుకాణదారులు విక్రయాలు, కొనుగోళ్లు చేయవద్దని హితవుపలికారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చట్టం మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు.

మోటారుసైకిళ్ల దొంగ అరెస్టు



భీమవరంలో నిందితుడు, స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

భీమవరం: మోటారు సైకిళ్లను దొంగిలిస్తున్న ఓ వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి అతని నుంచి మూడు మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. బుధవారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తణుకులోని బొడ్డనివారి వీధికి చెందిన బోను మోజేష్ ప్రస్తుతం భీమవరం వన్‌టౌన్ పరిధిలోని యనమదుర్రు కాలువ వద్ద నివాసం ఉంటూ పలు ప్రాంతాల్లో మోటారుసైకిళ్లు దొంగిలిస్తున్నాడు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి నేతృత్వంలో ప్రతేక బృందాన్ని ఏర్పాటు చేయగా మోటారు సైకిళ్లు దొంగిలించిన మోజేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అతని వద్ద నుంచి రూ.80 వేల విలువైన బజాజ్ పల్సర్, రూ.75 వేలు విలువైన యాక్టివా, రూ.50 వేలు విలువైన ప్యాషన్ ప్లస్ మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసనగా సీపీఎం ర్యాలీ



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం: కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరామ్ మాట్లాడుతూ బడ్జెట్ బడా కార్పోరేట్లకు వరాలు ఇచ్చి ప్రజలపై కేంద్రం భారాలు మోపిందని విమర్శించారు. తెలుగుదేశం, జనసేన మద్దతుతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆంధ్ర రాష్ట్రానికి మేలు చేస్తుందని ప్రజలు భావించారని, అయితే బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. రాజధాని నిర్మాణానికి సహాయంగా కాకుండా రూ.15 వేల కోట్లు అప్పుగా సర్దుబాటు చేస్తామని చెప్పడం దారుణమన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, నిర్వాసితుల సమస్య, కడప స్టీల్‌ప్లాంట్, విశాఖ రైల్వేజోన్ ఊసే లేదన్నారు. వ్యవసాయ రంగానికి అవసరమైన నిధులు, కేటాయింపులు, పంటలకు గిట్టుబాటు ధర ప్రస్తావన లేదన్నారు. నాయకులు బి.వాసుదేవ రావు, కె.రాజారామ్మోహన్‌రాయ్, ఎం.వైకుంఠ రావు, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

దొడ్డిదారిన డ్వాక్రా సీఏల తొలగింపు

- వైఎస్సార్ సీపీ అనుకూల సీఏలే లక్ష్యంగా టీడీపీ నేతల హుకుం
- డ్వాక్రా సంఘాల సమావేశాలు నిర్వహించి మరీ తీర్మానాలు
- కీలకపాత్ర పోషిస్తున్న ఏపీఎంలు.. ద్వారకాతిరుమలలో వెలుగులోకి..



పంగిడిగూడెంలో డ్వాక్రా మహిళల సమావేశం

ద్వారకాతిరుమల: ప్రభుత్వం మారిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్న కొందరు వెలుగు సీఏ (వీఓఏ)లను తొలగించి, తమ పార్టీకి అనుకూలమైన వారిని ఆ స్థానంలో నియమించాలని టీడీపీ నేతలు హుకుం జారీ చేస్తున్నారు. ఆ ఆదేశాలను వెలుగు ఏపీఎం తమ సీసీల ద్వారా అమలు చేయిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొందరు టీడీపీ నేతలు ద్వారకాతిరుమల మండలంలోని పలు గ్రామాలకు చెందిన వెలుగు సీఏలను టార్గెట్ చేశారు. వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నారన్న నెపంతో ఐఎస్ రాఘవాపురం, ఐఎస్ జగన్నాథపురం, వేంపాడు, మెట్ట పంగిడిగూడెం, పంగిడిగూడెం, జి.కొత్తపల్లి గ్రామాల్లోని సీఏలను తొలగించాలని కొందరు టీడీపీ నాయకులు నిర్ణయించారు. ఆ బాధ్యతను ఓ ఏపీఎంకు అప్పగించారు. ఆమె సీసీల ద్వారా గ్రామాల్లో డ్వాక్రా మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేయించి, ఏదో ఒక సాకు చూపి ప్రస్తుత సీఏలను తొలగిస్తున్నట్టు తీర్మానాలు చేయిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే బుధవారం పంగిడిగూడెం ఎస్సీ కాలనీలోని రామాలయం వద్ద డ్వాక్రా మహిళలతో సీసీ సమావేశాన్ని నిర్వహించి సీఏలుగా వ్యవహరిస్తున్న ఇద్దరు మహిళలను మార్పు చేస్తూ సంఘ సభ్యులతో తీర్మానాలు చేయించారు. అయితే ఏ తప్పు చేయని సీఏలను ఎలా తీసేస్తున్నారు.. అసలు ఇదంతా ఎవరు చేయిస్తున్నారని గ్రామ సర్పంచ్ ప్రత్తిపాటి యోహాను సీసీని ప్రశ్నించగా, టీడీపీ నాయకులు చేయమన్నారని, తమ అధికారిణి ఏపీఎం ఆదేశాల మేరకే ఇదంతా చేస్తున్నామని ఆమె సమాధానమివ్వడం గమనార్హం.

ఏపీఎం ద్వంద్వ వైఖరి

దీనిపై ఏపీఎంకు సర్పంచ్ యోహాను ఫోన్ చేయగా తానేమీ సీఏలను తొలగించమని చెప్పలేదని అన్నట్లు తెలిసింది. సీఏలను ఇంకా ఎందుకు మార్చలేదని టీడీపీ నాయకులు ఆమెను అడిగితే.. సీసీ తొలగించడం లేదని వారికి చెప్పి ఆమె తప్పించుకుని తమను ఇరికిస్తున్నారని ఒక సీసీ ఆవేదన వ్యక్తం చేస్తోంది. వాస్తవానికి ఏపీఎం ఆదేశాలు లేకుండా సీసీ ఏ నిర్ణయం తీసుకోవడానికి అవకాశం లేదు. తప్పు చేసిన సీఏలను తొలగించి, వారి స్థానంలో కొత్త వారిని నియమించాలంటే ఏపీఎం స్వయంగా సంబంధిత డ్వాక్రా సంఘాలతో సమావేశాన్ని నిర్వహించి, తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ సీసీల ద్వారా ఈ తతంగాన్ని చక్కబెట్టేస్తున్నారు. దీనిపై ఏపీఎం అరవిందమ్మను వివరణ కోరగా తాను ఈరోజు ఆఫీసుకు రాలేదని, సీఏల తొలగింపు విషయాన్ని మినిట్స్ చూసి చెబుతానని సమాధానమిచ్చారు.

ఇంటర్ విద్యార్థులకు టెక్ట్స్ బుక్స్ పంపిణీ



ప్రభుత్వ పాఠ్యా పుస్తక విక్రయ కేంద్రంలో ఇంటర్ పుస్తకాలతో జిల్లా మేనేజర్ తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుత పశ్చిమ, ఏలూరు జిల్లాలకు సంబంధించి 47 మండలాలకుగాను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం అన్ని టైటిల్స్, అన్ని గ్రూపులకు సంబంధించి 35,693 ప్రభుత్వ టెక్ట్స్ బుక్స్‌ను తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ పాఠ్య పుస్తక విక్రయ కేంద్రానికి వచ్చాయిని కేంద్రం మేనేజర్ టి.భాస్కర్‌రావు వెల్లడించారు. 2024-25 విద్యా సంవత్సరానికి కొత్తగా ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 18,678 పుస్తకాలను 25 మండలాలకు పంపించినట్లు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో అన్ని పుస్తకాలు మిగిలిన అన్ని మండలాలకు పంపుతామని చెప్పారు. అదేవిధంగా అన్ని టైటిల్స్ 1 నుంచి 10వ తరగతి వరకు నూటికి నూరుశాతం పుస్తకాలు జిల్లాలో పంపిణీ చేసినట్లు వివరించారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమంటూ దందా

క్రరీ పాయింట్ నిర్వాహకుడిని బెదిరించి డబ్బులు వసూలు



విలేకరులకు నకిలీ గుర్తింపు కార్డులు చూపుతున్న ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్

ఏలూరు టౌన్ : ప్రభుత్వ అధికారులమంటూ దుకాణదారులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న నలుగురు నకిలీ విలేకరులను అరెస్టు చేసినట్లు ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు చెప్పారు. బుధవారం ఏలూరు రూరల్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో మండల అప్పలనాయుడు కర్రీ పాయింట్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 22న ఒక మహిళ కర్రీ పాయింట్ వద్దకు వచ్చి తాను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అంటూ దుకాణంలోని కూరల్లో ప్రమాదకరమైన రసాయనాలు కలుపుతున్నారనే సమాచారం వచ్చిందని, కర్రీపాయింట్‌ను సీజ్ చేస్తామంటూ బెదిరించింది. తమ ఉన్నతాధికారితో ఫోన్‌లో మాట్లాడాలంటూ ఒక వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడించింది. ఫోన్‌లో అతను కర్రీపాయింట్ యజమాని అప్పలనాయుడ్ని బెదిరిస్తూ దుకాణం సీజ్ చేయకుండా ఉండాలంటే రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో భయపడిన దుకాణం యజమాని తన వద్ద ప్రస్తుతం రూ.3,500లే ఉన్నాయని చెప్పగా, వాటిని తీసుకున్న మహిళ, మరో రూ.6,500 గంటలో పెదపాడు రోడ్డు మలుపులో తీసుకురావాలని చెప్పి వెళ్లిపోయింది. అనంతరం అప్పలనాయుడు డబ్బులు తీసుకువెళ్లి వారికి ఇచ్చాడు. ఆమె ఫోన్ నంబర్ ఇవ్వాలని కోరగా స్విచ్ ఆఫ్‌లో ఉన్న నంబర్‌ను అతని ఇవ్వడంతో అనుమానం వచ్చి ఈనెల 23న ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్‌కు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాలతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తీగలాగితే కదిలిన డొంక

కర్రీపాయింట్ దుకాణదారుని వద్ద డబ్బులు వసూలు చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎవరనే దానిపై ఏలూరు రూరల్ పోలీసులు విచారణ చేపట్టగా మీడియా ముసుగులో నకిలీ విలేకరుల పాత్ర బయటపడింది. చాటపర్రు గ్రామానికి చెందిన ముంగర వెంకట దుర్గ అలియాస్ ఘంటసాల దుర్గ నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. ఆమె వద్ద ఓ చానల్ ఐడీ కార్డును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అధికారి పాత్ర పోషించిన హనుమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన బుక్కూరి దేవీప్రసాద్, మారుతీనగర్ ప్రాంతానికి చెందిన అగ్గాల ఉమామహేశ్వరి, ఎంఆర్‌సీ కాలనీకి చెందిన పులిగ రాంబాబులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరంతా ఓ ఛానెల్ రిపోర్టర్లు, చానల్ డైరెక్టర్, కెమెరామెన్‌గా గుర్తింపు కార్డులు కలిగి ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరి నుంచి రెండు మోటారు సైకిళ్ళు, గుర్తింపు కార్డులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్టుకు ఏలూరు రూరల్ స్టేషన్ హెచ్‌సీ కే.సత్యారావు, కానిస్టేబుల్స్ పి.నాగరాజు, బి.చెన్నారావు, జి.అజయ్, మహిళా కానిస్టేబుల్ చైతన్యలను డీఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్, రూరల్ ఎస్సై కే.రాజారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

జంగా గోపాల్ మృతికి పలువురు సంతాపం


జంగా గోపాల్

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణ ప్రముఖులు, విద్యావేత్త జంగా గోపాల్ మృతి పట్ల ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, పట్టణ ప్రముఖులు వలవల బాబ్జీ, ఈతకోట తాతాజీ, నంధ్యాల కృష్ణమూర్తి, మార్నీడి బాబ్జి, సర్పంచ్ పోతుల అన్నవరం, ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు తదితరులు సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

ఘనంగా విద్యా వారోత్సవాలు


భవిత సెంటర్‌లో క్రీడా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ప్రభుత్వ పాఠశాలలో విద్యా వారోత్సవాలలో భాగంగా సుబ్బారావుపేట ఐదో వార్డులోని భవిత సెంటర్‌లో బుధవారం క్రీడా దినోత్సవం జరిగింది. భవిత విద్యార్థులు, అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులు సంయుక్తంగా వివిధ రకాల ఆటలు ఆడారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాలీశ్వరయ్య, కే.కుమారి, ఎం.చంద్రకుమారి, సత్యవతి, నాగలక్ష్మి, రత్నకుమారి తదితరులు పర్యవేక్షించారు. విద్యార్థులు ఉత్సాహవంతంగా పోటీల్లో పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో నిరాశ్రయులకు కిట్ల పంపిణీ


తణుకులో పరిశుభ్రత కిట్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

తణుకు: ఇటీవల కురిసిన వర్షాలకు ముంపునకు గురైన తణుకు మండలం దువ్వ, కోనాల గ్రామాల్లో నిరాశ్రయులైన కుటుంబాలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ మంతెన శివరామభద్రిరాజు ఆదేశాల మేరకు సుమారు 65 కుటుంబాలకు తణుకు తహసీల్దార్ ముక్తేశ్వరావు చేతులు మీదుగా పరిశుభ్రత కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తణుకు రెడ్ క్రాస్ సొసైటీ మేనేజర్ కారుమంచి యోహాన్, వాలంటీర్లు రామ్‌చరణ్, బోస్, తేజస్వి, ధన, బాలు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులపై భారం


మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు

తాడేపల్లిగూడెం (టీటీసీ): దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు విమర్శించారు. పట్టణంలో బుధవారం కేంద్ర బడ్జెట్‌పై స్పందించారు. నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు ఎలాంటి ఊరట ఇవ్వకపోగా అదనపు బారాలు మోపారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు లేదని, ఎరువులు, పురుగుల మందుల ధరలతో పెంపుతో రైతులపై మరింత భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగానికి, సామాజిక రంగానికి, విద్యకు, ఉపాధిహామీ పథకం, ఆహారం, ఎరువులు, పురుగు మందులు, ఇంధనం తదితర రంగాలకు సబ్సిడీలకు నిధులు కేటాయింపుపై కోత విధించారని, సుమారుగా 7.8 శాతం కోత విధించారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి


ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెంటపాడు: ప్రకృతి వ్యవసాయంపై ప్రతీఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ కో– ఆర్డినేటర్ అరుణకుమారి పేర్కొన్నారు. బుధవారం పెంటపాడు మండలం అలంపురం రైతుభరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ డివిజన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిబ్బందికి కోడిగుడ్డు, నిమ్మకాయ ద్రావణం తయారీ, ఉపయోగాలు వివరించారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని నిషేధించి, ఖర్చుతక్కువ, ఫలితం ఎక్కువగా ఉండే కషాయాల పట్ల అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వీర్రాజు, సుబ్బారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షం..అపార నష్టం


కొండేపాడులో వారం నుంచి నీట మునిగిన వరిపొలాలు


నీటమునిగిన వరిపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

- ఉప్పొంగిన యనమద్రురు కాలువ
- కలత చెందుతున్న కర్షకులు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు

పెంటపాడు: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నారుమడులు చెరువులను తలపిస్తున్నాయి. ఈ నీటిని బయటకు తరలించడానికి అధిక వ్యయం అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ రోజులు నీరు ఉంటే నారుమడి కుళ్లిపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. మండలంలో మీనవిల్లూరు, కొండేపాడు, బోడపాడు, ముదునూరు, ఆకుతీగపాడు, విప్పర్రు, తదితర గ్రామాల ఆయకట్టు నీట మునిగింది. ఇప్పటికే ఎకరాకు దుక్కి, నారుమడులు, నాట్లు వేసేందుకు, ఒక కోటా మందుకు, కూలీలకు రూ. 8 వేలు పైనే ఖర్చు అయినట్లు రైతులు చెబుతున్నారు. కొంతమందికి దాళ్వా ధాన్యం సొమ్ములు ఇంకా పడలేదు. పెట్టుబడికి వారి వద్ద చిల్లిగవ్వకూడా లేదని రైతులు వాపోతున్నారు. ఈ తరుణంలో కూటమిప్రభుత్వం తక్షణం రైతులను ఆదుకొని ఒక ప్రకటన చేయాలని, రైతులకు పెట్టుబడులకు సొమ్ములు అందజేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అప్పు చేసి నాట్లు వేశా



ఈ సార్వా కు సకాలంలో వర్షాలు పడ్డాయని సంతోషించాం. వరద కారణంగా పంట నీట మునిగింది. అప్పు చేసి నాట్లు వేశా. ఆర్థికంగా ఎంతో నష్టపోయా. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి.

–కొణతాల వెంకట్రావు, రైతు ఆకుతీగపాడు

రైతులను ఆదుకోవాలి



గత జగనన్న ప్రభుత్వంలో ఇటువంటి ప్రకృతి వైపరీత్యాలు జరగలేదు. అయినా సకాలంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పెట్టుబడి సాయాలు అందాయి. చంద్రబాబు హయంలో రైతులు ఇబ్బందులు పడటం రైతుల దురదృష్టం. గతంలో చంద్రబాబు రైతులపట్ల నిర్లక్ష్య దోరణితో ఉన్నారు.ఈ సారైనా రైతులను ఆదుకోవాలి.

–కట్టుబోయిన కృష్ణప్రసాద్, జట్లపాలెం

గట్లు పటిష్టం చేయాలి



గ్రామాల్లో నాట్ల ప్రక్రియ పూర్తయింది. యనమద్రురు పొంగడంతో పొలాలు ముంపు బారిన పడ్డాయి. ఏటా గ్రామంలో రైతులకు ముంపు భయం తప్పడం లేదు. కాలువ గట్లు పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది. అసలే ధాన్యం సొమ్ములు పూర్తిగా రాక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

–దొడ్డిగర్ల చంద్రయ్య, కె. పెంటపాడు

ముంపులోనే పొలాలు

- తగ్గిన వరద ఉధృతి
- మండపాకలో అధికారుల పర్యటన


మండపాకలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

తణుకు టౌన్: ఎర్రకాలువ వరద తగ్గుముఖం పట్టడంతో తణుకు మండలంలోని వయ్యేరు నీటి ప్రవాహం కూడా తగ్గు ముఖం పట్టింది. దీనితో బుధవారం ఉదయం నుంచి ముంపు గురైన పంట పొలాల నుంచి మురుగునీరు వెనక్కు పారడం ప్రారంభించింది. గత వారం రోజులుగా వరద నీటిలో మునిగిపోయిన వరి పొలాల్లో అధికారులు పర్యటించారు. మండలంలో తేతలి, దువ్వ, ముద్దాపురం, కోనాల, మండపాక తదితర గ్రామాల్లోని భారీ వర్షాలు, వరదల కారణంగా ముంపుకు గురైన పొలాలను తహసిల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, వ్యవసాయాధికారి కె కుసుమలు పరిశీలించారు. ఈసందర్భంగా రైతులను కలసి సమస్యలు, నష్టం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

యనమదుర్రు డ్రెయిన్‌కు తగ్గిన నీటి ప్రవాహం

అత్తిలి: యనమదుర్రు డ్రెయిన్‌లో నీటి ప్రవాహ ఉధృతి కొద్దిమేర తగ్గడంతో ఆరుదలకోడు అవుట్ పాల్ స్లూయిజ్‌కు ప్రమాదం తప్పింది. యనమదుర్రు డ్రెయిన్‌కు ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరదనీరు వచ్చిచేరడంతో అత్తిలి మండల పరిధిలో గల మేజర్ డ్రెయిన్‌లు పొంగి ప్రవహించాయి. దీంతో వేలాది ఎకరాలలో వరినాట్లు ముంపుకు గురైయ్యాయి. అత్తిలి మండలంలో గల రాచకోడు, ఈర్లకోడు, మంచిలి, ఆరుదలకోడు మేజర్ డ్రెయిన్‌ల ఉధృతికి వరినాట్లు, నారుమడులు నీట మునగాయి. ప్రతి ఏడాది సార్వాసీజన్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతంనుంచి వరదనీరు యనమదుర్రు డ్రెయిన్‌లోకి వచ్చి చేరడంతో పంటచేలు ముంపుబారిన పడి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగులుస్తుంది. వర్షంనీరు మండలంలోగల ప్రధానమైన రాచకోడు, ఈర్లకోడు, మంచిలి, ఆరుదలకోడు డ్రెయిన్‌ల నుంచి అవుట్‌పాల్ స్లూయిజ్‌ల ద్వారా యనమదుర్రు డ్రెయిన్‌లోకి చేరుతుంది. అయితే ఎగువ నుంచి యనమదుర్రు డ్రెయిన్‌లోకి వరదనీరు భారీకి వచ్చి చేరడంతో డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో మండలంలోగల మేజర్ డ్రెయిన్‌ల అవుట్‌పాల స్లూయిజ్‌లు మూసివేసారు. ఫలితంగా మేజర్ డ్రెయిన్‌లు పొంగి ప్రవహించి పంట చేలను ముంచెత్తింది. వరిపంట నీట ముంపులో ఉండటం వల్ల పంటకుళ్లిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేలాదిరూపాయాలు పెట్టుబడులు పెట్టామని, సార్వాసాగులో తమకు పంటనష్టాలు తప్పడంలేదని వాపోయారు. అధికారులు. ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.


బల్లిపాడు ప్రాంతంలో ముంపులో ఉన్న వరినాట్లు


అత్తిలిలో ఉధృతంగా ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్

డ్రెయినేజీకి కొత్త కల్వర్టును నిర్మించండి


స్థానిక 12వ వార్డులో లో-లెవిల్‌లోని పాత కల్వర్టు

తాడేపల్లిగూడెం (టీటీసీ): డ్రెయినేజీపై అస్తవ్యస్తంగాను, లో–లెవిల్‌లో ఉన్న పాత కల్వర్టును తొలగించి, ఎత్తు పెంచి కొత్తగా కల్వర్టును నిర్మించి స్థానిక ప్రజలను ఆదుకోవాలని పాతూరు 12వ వార్డు వేప చెట్టు ప్రక్క వీధి ప్రాంత వాసులు కోరుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ కల్వర్టు లో–లెవిల్ ఉంది. మురుగును తాకుతూ కల్వర్టు ఉండటంతో పాటు వ్యర్థాలు తరుచుగా శిథిలమైన కల్వర్టులో ఆగిపోతున్నాయి. దీంతో మురుగు నీరు ప్రవహించేందుకు కల్వర్టు అడ్డంకిగా మారింది. కల్వర్టు వద్ద సరిగా మురుగు నీటి పారుదల లేకపోవడంతో వాడకం నీరు, బురద నీరు రోడ్డుపైకి చేరుతున్నాయి. చిన్నపాటి వర్షానికి సైతం రోడ్డుపైన నీరు నిలిచిపోతుంది. అధికారులు దృష్టికి కల్వర్టు విషయమై ఎన్నోసార్లు తీసుకువెళ్లడం జరిగిందని, అధికారులు సైతం పరిశీలించారని, అయితే సమస్య నేటికి పరిష్కారం కాలేదని స్థానికులు చెబుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి కొత్త కల్వర్టును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పాత కల్వర్టును తొలగించి కొత్త కల్వర్టును నిర్మించాలి



పాతూరు 12వ వార్డు, వేపచెట్టు ప్రక్కన ఉన్న అంతర్గత రహదారికి వద్ద పాత కల్వర్టును తొలగించి కొత్త కల్వర్టును ఏర్పాటు చేయాలి. మురుగు నీరు ముందుకు ప్రవహించకుండా కల్వర్టు రాళ్ల అడ్డుకుంటున్నాయి. అధికారులు తక్షణమే కల్వర్టు నిర్మాణానికి అధికారులు కృషి చేయాలి.

–నల్లగంచు రాంబాబు, పాతూరు, తాడేపల్లిగూడెం

మహనీయుడు అయ్యంకి


పురుషుల గ్రంథాలయంలో వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేయాలని, ఊరూరా పుస్తకాల పరిమిళాలు వెదజల్లాలని గ్రంథలయోద్యమానికి శ్రీకారం చుట్టిన మహనీయుడు అయ్యంకి వెంకటరమణయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. గ్రంథాలయ ఉద్యమ నాయకులు అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి వేడుకలు బుధవారం తణుకులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ కౌన్సిలర్, విగ్రహ దాత వావిలాల సరళాదేవి ఆధ్వర్యంలో పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వావిలాల సరళాదేవి మాట్లాడుతూ ప్రజలలో అక్షరాస్యతను పెంపొందించేందుకు గ్రంథాలయ ఉద్యమం ద్వారా అయ్యంకి వెంకటరమణయ్య కృషి చేశారని చెప్పారు. అయ్యంకి వెంకటరమణయ్య స్ఫూర్తి నేటి గ్రంథపాఠకులకు అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె. సుగుణకుమారి, సితారే, కౌరు వెంకటేశ్వరరావు, ఆకుమర్తి రాజు, నక్కా రామారావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షను విడనాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో సరస్వతి

తాడేపల్లిగూడెం రూరల్: సమాజంలో బాలికల పట్ల లింగ వివక్ష విడనాడాలని ఐసీడీఎస్ సీడీపీవో టీఎల్.సరస్వతి అన్నారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఎల్.అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సరస్వతి మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్ల లోపు వివాహాలు చేయరాదన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలికల అక్రమ రవాణా నేరమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, వారి భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. భారత న్యాయ సంహితలోని చట్టాల గురించి వివరించారు. అలాగే, అప్పారావుపేట అంగన్‌వాడీ కేంద్రంలోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దుర్గాభవాని, ఎస్తేరు రాణి, విశాలాక్షి, జీఎంఎస్కే జి.బేబిరాణి, అంగన్‌వాడీ సిబ్బంది కే.ఝాన్సీలక్ష్మి, కే.కుమారి, పి.సత్యవతి, బి.శైలజ కుమారి, కే.గౌరీ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం



తణుకులో నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

తణుకు: కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఏపీ ప్రజలు కోరుకుంటున్న ప్రత్యేక హోదా, విభజన హామీలు లేకపోవడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ విమర్శించారు. బుధవారం స్థానిక వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో బడ్జెట్‌లో ఏపీకు జరిగిన అన్యాయంపై నిరసన తెలియజేసి అనంతరం బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఏపీకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. కేవలం అమరావతి నిర్మాణానికి రూ. 15 వేల కోట్లు ప్రపంచ బ్యాంకు నుంచి అప్పు తెచ్చుకోవడానికి మాత్రమే మోదీ ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఏపీ భవిష్యత్తు బాగుండాలంటే కచ్చితంగా ఇండియా కూటమి అధికారంలోకి రావాలన్నారు. సీపీఎం నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, గుబ్బల గోపి, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



ప్రచారం నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ ఏరియా కమిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని కోతిబొమ్మ సెంటర్‌లో ఆగస్టు 1వ తేదీన ఐఎఫ్‌టీయూ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో రాజకీయ క్లాసులు జరుగుతాయని డివిజన్ ప్రధాన కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్ వెల్లడించారు. స్థానిక శేషమహల్ సెంటర్‌లో బుధవారం క్లాసులు విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టీయూ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామన్నారు. కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రచారంలో ఉదయరాజు, రమణ, సత్యనారాయణ, రాము, సతీష్, విజయ్, సత్తిబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో మనోధైర్యంతో మెలగాలి


తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరమణకు నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: అధికారులు విధి నిర్వహణలో మనోధైర్యంతో మెలగాలని, తమకు కుటుంబం ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ అన్నారు. నర్సాపురం ఎంపీడీవో వెంకటరమణ బలవన్మరణం చెందడం పట్ల బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని మండల పరిషత్ అధికారులు, సిబ్బంది నివాళి ఘటించారు. మండల పరిషత్ ఏవో ఆర్ఏఎల్.సుజాత, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్ భరత్, సిబ్బంది జే.రత్నకుమార్, కే.యోహాను పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యానేరం


పాలిలో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

అత్తిలి: మండలంలోని పాలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 100 రోజుల మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 18 ఏళ్లు నిండకుండా ఆడపిల్లలకు, 20 ఏళ్లు నిండకుండా మగ పిల్లలకు పెళ్లి జరగకుండా చూడాలని అత్తిలి సూపర్‌వైజర్ కె కుమారి చెప్పారు. బాల్యవివాహాలు జరిపే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు. బాలలను వెట్టిచాకిరీ చేయించుకున్న చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ అధికారిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలలో స్వల్పకాలిక వరిరకాలను సాగుచేసుకోవాలి


కొమ్మరలో పంటముంపు రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ రాజేష్

అత్తిలి: వరద ముంపు ప్రాంతాల్లో పంట నష్టపోయిన రైతాంగం స్వల్పకాలిక వరి రకాలను మాత్రమే సాగుచేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. బుధవారం అత్తిలి మండలం కొమ్మర, పాలూరు, తిరుపతిపురం గ్రామాల్లో వరిచేలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ రాజేష్ మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల అత్తిలి మండలంలో 3200 ఎకరాలలో వరినాట్లు, 120 ఎకరాలలో నారుమడులు నీట మునగాయని తెలిపారు. నీట మునిగిన 5 రోజుల లోపు వరినారు మడి నుంచి నీటిని పూర్తిగా బయటకు తీసి 5 సెంట్లు నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో ఎంఓపీ వేసుకోవడం వల్ల కొత్తఆకు వచ్చినాట్లు వేయడానికి అందివస్తుందన్నారు. మొక్క నిలదొక్కుకున్న తరువాత ఒక గ్రాము కార్బెండిజమ్ మిశ్రమాన్నిపై పాటుగా పిచికారీ చేయడం ద్వారా తెగుళ్ల బెడద తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్వో కొండబాబు, రామకృష్ణ, ఉషాదేవి, వీపీఏ సాహిత్య, భరత్, రైతులు పాల్గొన్నారు.

మంచిలి డ్రెయిన్ ముంపు సమస్యను పరిష్కరించాలి


మంచిలిలో ముంపు సమస్యను వివరిస్తున్న స్థానిక రైతులు

అత్తిలి: మండలంలో మంచిలిలో మురుగునీటి డ్రెయిన్ వల్ల కలిగే పంట ముంపు సమస్యను పరిష్కరించాలని రైతాంగం కోరుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో గల ప్రధాన మురుగునీటి డ్రెయిన్‌లు ఉధృతంగా ప్రవహించడంతో వరినాట్లతో పాటు నారుమడులు ముంపు బారిన పడ్డాయి. అయితే మంచిలి నుంచి కిందకు వెళ్లే మురుగునీటి డ్రెయిన్‌కు దిగువ ప్రాంతంలో దంతుపల్లి వద్ద ఈర్లకోడు డ్రెయిన్‌లో కలిసే ప్రాంతంలో ఈప్రాంతానికి చెందినవారు అడ్డుకట్టు వేసారని, దీంతో మురుగునీరు ప్రవాహానికి ఆటంకం ఏర్పడిందని రైతులు వాపోయారు. ఈడ్రెయిన్ ముంపువల్ల మంచిలి, బొంతువారిపాలెం, పాలి గ్రామలకు చెందిన 800 ఎకరాలు ముంపులోఉందని, ముంపు సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం రైతులు డ్రెయిన్ వద్దకు చేరుకున్నారు. అధికారులు వచ్చి ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని నినాదాలు చేశారు. దీంతో మండల తెదేపా నాయకులు అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. ఇక్కడ రైతులు ఎదుర్కొంటున్న ముంపు సమస్యను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దృష్టికి తీసుకువెళ్లామని, ఎమ్మెల్యే స్పందిస్తూ దీనిపై శనివారం తణుకులో ఆయన క్యాంపు కార్యాలయంలో డ్రెయినేజీ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారని టీడీపీ మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణరావు రైతులకు తెలిపారు. దీనిపై రైతులు సమ్మతించి అక్కడ నుంచి వెనుదిరిగారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శీతాల శ్రీనివాసరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు సత్తిపండురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజదాని నిర్మాణానికి నిధులు కేటాయింపుపై హర్షం

తణుకు టౌన్: కేంద్ర బడ్జెట్‌లో రాజదాని నిర్మాణానికి నిధులు కేటాయించడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ నాయకురాలు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముళ్లపూడి రేణుక హర్షం వ్యక్తం చేశారు. బుధవారం తణుకులోని రేణుక నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించడం డబుల్ ఇంజన్ సర్కార్‌కే సాధ్యమైందన్నారు.

నేడు గోయంకాలో ఇంగ్లిషు ల్యాబ్ ప్రారంభం

పెంటపాడు: మండలంలోని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల త్రిపుల్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్మించిన ఇంగ్లిషు ల్యాబ్‌ను ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.6 లక్షలతో నిర్మించిన ఈ ల్యాబ్‌ను త్రిపుల్‌ఎఫ్ డైరెక్టర్ సీమా గోయంకా ప్రారంభిస్తారన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.